# మధుర భావన – 3

ఆ విగ్రహాన్ని సుమజ ఫ్రెండ్స్ అందరూ కూడా తమ చేతుల్లోకి తీసుకుని పట్టుకుని చూసి చాలా బాగుందని మెచ్చుకుని సముజ చేతికి అందించారు.

''రేపు ఉదయం ఆటలతోనూ, సాయంకాలం సంగీత సాహిత్యాలతోనూ కాలక్షేపం చేద్దాం.... పాటల కార్యక్రమంలో పెద్దలూ, పిల్లలూ అందరూ పాల్గొనాల్సిందే. మీకు ఇష్టమైన పాత, కొత్త సినిమా పాటలుగానీ, లలితగీతాలైనా సరే జ్ఞాపకం చేసుకుని సిద్ధంగా ఉండండి. ఆటల పోటీల్లోనూ అందరూ ఉత్సాహంగా పాల్గొనాలనీ విజ్ఞప్తి చేస్తున్నాం...!'' అంటూ స్టేజి మీదున్న వ్యక్తి చెప్పి క్రిందకు దిగి వెళ్ళిపోయాడు.

''ఇక మీ అందరూ కదిలి మీ మీ గదులకు వెళ్ళి విశ్రమించండి'' అని చె ప్పటంతో కొంతమంది లేచి మెల్లగా బయలుదేరారు. మరి కొంతమంది మాత్రం కబుర్లు కొనసాగిస్తూ కుర్చీలలోనే కూర్చున్నారు.

సుమజ స్నేహితులతో కలిసి వెళ్తూ ఫ్రెండ్సందరికీ గట్టిగా చెప్పింది 'వంశీ తన సెల్ నెంబరు అడిగితే ఇవ్వవద్దని'. వాళ్ళు అలాగేనని తలలూపారు. ఆ ఆవరణలోనే దామోదరంగారు కొత్తగా కట్టించిన రెండు గెస్ట్ హౌస్ లలోనూ అతిథులకు బస ఏర్పాటు చేశారు. మరికొంతమందికి మాత్రం అక్కడకు దగ్గర్లోనే హోటల్ రూమ్స్‌ను బుక్ చేయటం జరిగింది.

ఆ మరునాడు ఉదయం కాఫీ టిఫిన్లూ అన్నీ అయ్యాక సరదాగా జరిగిన ఆటల పోటీల్లో, సుమజ, తన ఫ్రెండ్స్ పాల్గొన్నారు. సుమజకు సూదీ, దారం పోటీల్లో పరుగులో రెండు బహుమతులు వచ్చాయి.

వంశీ మాత్రం ఆటల్లో పాల్గొంటున్న వాళ్ళని ఉత్సాహంగా చూస్తూ కూర్చుండిపోయాడు. వంశీ అభినందనల్ని సుమజ చిరునవ్వుతో స్వీకరించింది.

సాయంకాలం సాహిత్యం సంబంధిత క్విజ్ ఉందని ప్రకటించారు. కొన్ని ప్రశ్నలకు చాలామందే జవాబులు చెప్పారు. వా ళ్ళందరి పేర్లు ఇద్దరు వ్యక్తులు నోట్ చేసుకుంటున్నారు.

'నవ్విపోదురుగాక నాకేటి సిగ్గు...'

'కృష్ణశాస్త్రి బాధ ప్రపంచానికి బాధ...'

'సత్కవుల్ హాలికులైన నేమి...'

అన్నదెవరూ అనే ఈ ప్రశ్నలకు చాలామందే జవాబులు చెప్పారు. దేవులపల్లి, చలం, పోతన అంటూ రకీమని చెప్పారు. కొన్నింటికి అందరూ మౌనం వహించినపుడు వంశీ మాత్రం గడగడ జవాబులు చెప్పేశాడు.

'జానుతెనుగు విశేషము ప్రసన్నత కు' అన్న కవి ఎవరూ అనే ప్రశ్నకు, 'పాల్కుర్కి సోమన' అనీ, 'ఏ గతి రచయించిరేని సమకాలము వారలు మెచ్చరుగదా' అని వాపోయిన కవి ఎవరూ అన్నదానికి 'చేమకూర వేంకటకవి' అనీ, 'నాల్గు పడగల హైందవ నాగరాజు' అని గర్జించింది ఏ కావ్యంలో అనే ప్రశ్నకు 'గబ్బిలం' అనీ, 'సుకవి జీవించె ప్రజల నాలుకలయందు' అన్నదెవరూ అనే ప్రశ్నకు జవాబుగా 'జాషువా' అనీ వంశీ చెప్పేసరికి స్టేజీ మీద నిలబడి అడుగుతున్న అతనితో సహా అక్కడ కూర్చున్న వాళ్ళూ చాలామంది ఆశ్చర్యంగా, అభినందనగా వంశీవైపు చూశారు.

ఆ తర్వాత అడిగిన కొన్ని ప్రశ్నలకు 'తాజ్ మహల్ నిర్మాణానికి రాళ్ళెత్తిన కూలీలెవ్వరు' అన్నదెవరూ అనే ప్రశ్నకి 'శ్రీ శ్రీ' అనీ, 'నా అక్షరాలు వెన్నెల్లో ఆడుకునే అందమైన ఆడపిల్లలు' అన్నది 'బాలగంగాదర్ తిలక్' అనీ, 'మొదటి వచన ప్రబంధమును నేనే చేసితి' అన్నది 'కందుకూరి వీరేశలింగం గారు' అనీ జవాబుగా కొంతమంది చెప్పారు.

దాదాపుగా అన్ని ప్రశ్నలకూ సరియైన జవాబులు చెప్పిన వ్యక్తికి ప్రథమ బహుమతి ఇస్తున్నట్లుగా వంశీ పేరును ప్రకటింపబడినపుడు చప్పట్లు మిన్ను ముట్టాయి. పెద్దవాళ్ళు కాకుండా ఒక యువకుడు ఇలాంటి ప్రాచీన సాహిత్యంకు సంబంధించిన ప్రశ్నలకు జవాబులు చెప్పగలగటం చాలా సంతోషదాయకమైన విషయం అని, స్టేజి మీద నిలబడిన పెద్దమినిషితో పాటే, ఆహుతులూ చాలామంది అన్నారు.

''సాహిత్యంలో మీ కింత పరిచయం, ప్రజ్ఞ ఉందని అస్సలు ఊహించలేకపోయా...'' అంటూ సుమజ వంశీని అభినందిస్తూ ప్రశంసాపూర్వకంగా చూసింది. ''ఇంతమంది సభ్యుల ప్రశంసల్ని పొందగలగటం చాలా గొప్ప విషయం'' అంది మళ్ళీ మెచ్చుకుంటున్నట్లుగా.

వంశీ కొంచెంగా తలవాల్చి ''ఏమో... అడ్డదారిలో విజయం సాధించినందువలనేమో నాకంతగా ఆనందం కలగటం లేదుమరి!'' అన్నాడు మెల్లగా గొణుగుతున్నట్లుగా.

''అదేంటీ...?'' అంటూ సుమజ ఆశ్చర్యంగా చూసింది.

‘‘మీకో నిజం చెప్పనా?’’ అంటూ చిన్నగా నవ్వాడు వంశీ.’’ మా మామయ్యతో ఈ ఉదయం మాట్లాడుతూ అక్కడ దూరంగా చెట్టుదగ్గర కూర్చున్నానా, అపుడెవరో ఒకాయన కూర్చుని కాగితంపై ఏదో కాగితం చూసి రాసుకుని, ఆ పాత కాగితాన్ని ఉండచుట్టి దూరంగా విసిరేసి వెళ్ళిపోయారు. మామయ్య కూడా మాటలు ముగించి వెళ్ళిపోయాక, నేను ఆత్రుతతో ఆయన విసిరేసిన కాగితం ఉండను తీసుకుని ఏమిటాని పరికించి చూసా. అది ఎప్పటిదో ఒక పాత న్యూస్ పేపరులోనిది క్విజ్ టెస్ట్ ప్రచురింపబడినదన్నమాట. నేను యధాలాపంగా దానిని చదివా. క్రింద ఇచ్చిన సరియైన జవాబులనూ చదివి, ఆ కాగితాన్ని అక్కడే పడేసా. అయితే ఇపుడు క్విజ్ లోనివన్నీ ఆ కాగితంలోవేనని నాకు అర్థమైంది. ఆయన ఆ పేపరులోని వాటిలోవే క్విజ్ కు తయారు చేశారని నాకర్థమైపోయింది. జవాబులన్నీ గుర్తుండిపోయాయి. దాంతో అన్నిటికీ నేను కరెక్టు జవాబులు చెప్పగలిగాను. ఇదీ సంగతి, నిజంగా నాకు తెలిసిన విజ్ఞానంతో గెలిచినదికాదు ఇది కేవలం పేపరు నాకు లీకవటం వలన లభించిన గెలుపు అందువలనే పూర్తిగా విజయానందాన్ని అనుభవించలేకపోతున్నాను...!’’

సుమజ ముందు కొంచెం ఆశ్చర్యంగా చూసి తర్వాత చిన్నగా నవ్వింది.

‘‘అవునా...?’’ అని ఒక క్షణం తర్వాత మళ్ళీ అంది ‘‘అలా కొంచెం సేపు మాత్రమే చూసి జవాబులన్నీ అంత బాగా గుర్తుపెట్టుకోగలిగారంటే... అదీ ఓ ప్రత్యేకమైన విశేషమే! అంటే... సాహిత్యంలో మీ ప్రవేశానికి కాకుండా, మీ జ్ఞాపకశక్తికి వచ్చిన గెలుపుగా అనుకుంటే సరిపోతుందిగా...!’’

‘‘అలా అనుకోవచ్చంటారా...!’’ అంటూ వంశీ కూడా తీరిగ్గా నవ్వేసాడు.

ఒక క్షణం మౌనంగా ఉండి, ఆ తర్వాత ఏదో ఆలోచిస్తున్నట్లుగా చూస్తూ మెల్లగా అన్నాడు.

‘‘మీరు చెప్పినట్లుగా అనుకుంటే ఫర్వాలేదు, కొంచెం ఆనందంగానే అనిపిస్తోంది. అయితే పూర్తి విజయానందం కలగాలంటే మాత్రం.... నేననుకున్నది సాధించాకనే **కలుగుతుంది**....!’’

‘‘అంటే...?’’ ప్రశ్నార్థకంగా చూసింది

‘‘అంటే ఏముందీ... వీళ్ళిచ్చిన కృష్ణ విగ్ర హం ఎప్పటికీ నా దగ్గిరే ఉండాలనుకుంటున్నాను!’’

‘‘అంతేనా... అయితే, మీ దగ్గిరే ఎప్పటికీ ఉండనివ్వండీ, నాకేం అభ్యంతరం లేనేలేదు!’’ అంటూ సుమజ నవ్వింది.

''అలాక్కాదు...'' అంటూ వంశీ కొంచెం తొట్రుపడుతూ అన్నాడు ''నా ఉద్దేశ్యం వేరే... కేవలం ఆ విగ్రహం మాత్రమే కాదు...!''

''మరి...?'' ప్రశ్నార్థకంగా కొంచెం విస్మయాన్ని జోడించి చూసింది.

అతను సరదాగా నవ్వేసాడు... 'నా అభిప్రాయాన్ని విడమరిచి ఇపుడే చెప్పటం భావ్యం కాదు లెండి... కొన్నాళ్ళు పోయాక అయితే బావుంటుందేమో...!''

సుమజ మళ్ళీ అయోమయంగా చూస్తూ అంది ''మీ రెండుకలా అర్థం కానట్లుగా మాట్లాడుతున్నారో... నా ఊహకి అందటం లేదు...!''

''చెప్పానుగా, కొన్నాళ్ళు పోయాక అయితే... మీకూ అర్థం అవుతుంది... లేకపోతే నేనే చెబుతాను...!'' అంటూ నిట్టూర్చాడు. ఒక క్షణం ఆగి 'సరే, ఇక మా మా మామయ్యతో కలిసి బయలుదేరతాను... మరి సెలవ్ మీ అందరికీ...!' అన్నాడు వంశీ చేతులు జోడించి.

* * *

ఇంటికి వచ్చి రాగానే హడావుడిగా దేని గురించో వెతుకుతున్న వంశీని చూసి తల్లి అడిగింది ఏం కావాలని. ''అక్కడకు వెళ్ళేముందు ఒక కవరు వేరేవాళ్ళది మనింటికి వచ్చింది కదా, దానికోసం చూస్తున్నాను... వాళ్ళకి అంద చేద్దామని...'' అంటూ తల్లి సందేహానికి జవాబు చెప్పాడు.

''ఆ కవరు గురించా... మరి చెప్పవేం... హడావుడిగా ఇల్లంతా వెతుకుతూంటే, ఏదో ముఖ్యమైనదాని గురించనుకున్నా. ఆ కవరును మన వేణమ్మకిచ్చి పంపించాసాలే''

''అవునా...? వేణమ్మ మనింటికి ఎన్ని గంటలకు వస్తుందీ...?'' ఆరా తీశాడతను.

ఆమె ఆశ్చర్యంగా చూసింది. ''ఎందుకూ...?'' అనడిగింది.

''ఆ కవరు మీద అడ్రసు నాకు కావాలమ్మా...'' అన్నాడు తల్లివైపు కొంచెం ఇబ్బందిగా చూస్తూ.

ఆ సాయంకాలం వరకూ అతను వేణమ్మ రాక కోసం ఆదుర్దాగా ఎదురు చూసాడు. వేణమ్మ రాలేదు. ఇంకో ఆవిడ వచ్చింది.

అపుడు శ్యామసుందరి నుదురు కొట్టుకుంటూ ''మర్చేపోయాను. వేణమ్మ ఊరుకు పోతున్నానని చెప్పి తన పిన్ని కూతురుని పనికి ఓ నాలుగురోజులు పంపిస్తానని చెప్పింది. ఎల్లుండి మళ్ళీ తనే వస్తుంది!'' అని చెప్పగానే వంశీ మొహం వేలాడేసాడు.

మళ్ళీ ఆ వేణమ్మకోసం ఇంకా రెండు రోజులు ఎదురుచూడాల్సిందే నన్నమాట అనుకుంటూ నిట్టూర్చాడు వంశీ.

కొడుకు వైఖరి అంతుపట్టక శ్యామసుందరి కొంచెం వింతగా చూసి వూరుకుంది. వంశీకి ఆ రెండు రోజులూ ఆదుర్దావల్ల రెండు యుగాలుగా గడిచాయి. వేణమ్మని చూడగానే వంశీ మొహం వికసించింది. కవరు సంగతి ఆరా తీసాడు. వేణమ్మ తల గొక్కుంటూ ''ఇప్పుడేటయ్యా... ఆనాడే ఇచ్చేసాగదా'' అంది.

''ఆ కవరు మీద ఉన్న ఇంటి పెద్ద పేరు అమ్మకి గుర్తు లేదని చెప్పింది. మరి నీకు ఆ ఇల్లు వివరాలు తెలుసుగదా, నాకు పనుంది పెళ్ళి కలవాలి. ఎక్కడో, ఏమిటో, చెప్పూ'' అంటూ తొందరపెట్టాడు.

''అయ్యో... ఆరిల్లు నాకు తెలవదు బాబూ... మా నాగులు ఆరింట్లోనే పనిచేస్తుందని దాని చేతికిచ్చాను. ఆరి పేరు అమ్మగారే చదివి శంకరయ్యగారని సెప్పారు. రెండీదలవతలనుకుంటా...'' అన్నది. మళ్ళీ కాసేపు ఆగి ''ఈ నాలుగురోజుల కాడనుండీ మీ ఇంటికే పనికి వస్తుందిగందా, అడగలేకపోయారా...?'' అనేసరికి వంశీ విస్తుపోయాడు. మళ్ళీ నాగులమ్మ కోసం ఎదురు చూడాలి కాబోలని మనసులోనే విసుక్కున్నాడు.

నిర్ఘాంతపోయినట్లుగా నిలబడిన వంశీని చూసి వేణమ్మ మళ్ళీ చెప్పింది ''నాగులమ్మ ఇల్లు మాకు పక్కనే. రేపొద్దున్న పనిలోకి వచ్చేటపుడు ఆ శంకరయ్యగారిల్లెక్కడో నానడిగి మీకు సెపుతాలెండి...''

తలవూపి వూరుకున్నాడు వంశీ.

తల్లి ''అంత ముఖ్యమైన విషయం ఆ కవరులో ఏముందిరా... నాకు చెబితే సరిపోయేదిగా విడిగా ఉంచేదాన్ని. ఎవరిదో ఆ కవరు పోస్ట్ మాన్ మనకి పొరపాటున ఇచ్చేసాడని నువ్వు మామయ్యకు చెప్పటం విని... వేణమ్మ చేతికిచ్చాను... ఇచ్చెయ్యమని. వాళ్ళింట్లోనే ఈ నాగులమ్మ పనిచేస్తోందని దాని చేతికిచ్చి వేణమ్మ వూరుకెళ్లిందన్నమాట! ఈ విషయం మనకి తెలీదుగదా మరీ...!'' అంటూ శ్యామసుందరి కొడుకు వైపు ఆరాగా చూసింది.

‘‘ఒక ముఖ్యమైన ఫోను నెంబరు ఆ కవరుపై రాసాలే... దానికోసం.. అంతే...!’’ అంటూ తల్లికి వివరణ ఇచ్చి కొంచెం ఇబ్బందిగాచూసాడు.

ఆవిడా ఇక ఏం రెట్టించకుండా వూరుకుంది.

మర్నాడు వేణమ్మ వంశీకి చుప్పింది ‘‘రెండు వీధులవతల గాంధీబొమ్మకి ఎదురుగా ఉండే పచ్చమేడ...’’ అని నిదానంగా చెబుతూండగానే వంశీ ‘‘సరే...సరే... నేను కనుక్కుంటాలే...’’ అంటూ హడావుడిగా వెళ్ళిపోయాడు.

‘‘అదేటమ్మా... నాను పూర్తిగా సెప్పకుండానే బాబుగారంత తొందరగా ఎల్లిపోనారూ... ఇసిత్రంగా ఉందీ...! ఆ పచ్చమేడ పక్క ఇల్లే శంకరయ్యగోరిదని సెప్పబోతున్నానూ...’’ అంది ఆశ్చర్యంగా మొహం పెట్టి.

శ్యామ సుందరి నిట్టూర్చి ‘‘సరేలేవే... అక్కడికి వెళ్ళాక వాడే కనుక్కుంటాడులే. ఏదో ముఖ్యమైన పనే అయ్యుంటుంది... అందుకే కొంచెం హడావుడిగా ఉన్నాడు...’’ అంటూ ఆవిడ లోపలకు వెళ్ళిపోయింది.

వంశీ పచ్చమేడ ఇంటికి వెళ్ళి ఎవరో బయటకు వస్తూంటే... ‘‘ఇది శంకరయ్యగారి ఇల్లే కదండీ...?’’ అనడిగాడు.

దానికాయన తల అడ్డంగా ఊపి ‘‘ఇదికాదు... పక్క ఇల్లు...!’’ అని చెప్పి వెళ్ళిపోయాడు.

వంశీకి అపుడు అర్థమైంది వేణమ్మ చెప్పేది పూర్తిగా తను వినకుండా తొందరపడ్డాడని. పక్క ఇంటికి వెళ్తూ తనకి శంకరయ్యగారితో పనేంలేదు కదా, ఆ కవరుపై రాసి ఉన్న పేరును చూసాడు కదా అని గుర్తుకు తెచ్చుకోవటానికి ప్రయత్నించాడు. వెంటనే గుర్తురాలేదు సరే... ప్రయత్నం చేద్దాం అనుకున్నాడు.

పక్క ఇంటికి వెళ్ళాక తలుపు శబ్దం చేస్తే, తీసినాయన ఎవరు కావాలన్నట్లుగా చూస్తుంటే... మీ అమ్మాయి గారు ఉన్నారా అనడిగాడు తడబడుతూ.

ఆయన ఆశ్చర్యంగా చూసి ‘‘మాకు అమ్మయిలు లేరు బాబూ’’ అంటూ ‘‘మీరు...’’ అని ప్రశ్నార్థకంగా చూస్తుండిపోయాడు.

వంశీ కొంచెం సర్దుకుని ''అదేనండీ, కోడలు అనబోయి, కూతురు.. అన్నాను. నేను వారి ఫ్రెండు దగ్గర్నుండి వచ్చాను... అంటూ తన పేరు చెప్పాడు.

ఆయన ''మీనా'' అని పిలుస్తూ లోపల కెళ్ళిన రెండు నిముషాలకు ఒక అమ్మాయి వచ్చి ఆశ్చర్యంగా చూస్తూ నిలబడి కూర్చోమని చెప్పి ''మిమ్మల్ని నేనెపుడూ చూడలేదండీ. ఎవరు పంపించారు...నా ఫ్రెండు దగ్గర్నుంచని అన్నారట... ఎవరు, ఏమిటీ?'' అని ఆరాలు మొదలు పెట్టింది.

అక్కడున్న కుర్చీలో స్థిమితంగా కూర్చుని వంశీ ''అదేనండీ... మీ ఫ్రెండు సుమజ.... పండు... గుర్తు లేదూ...?'' అన్నాడు.

ఆ అమ్మాయి కళ్ళు పెద్దవిచేసి చూస్తూ ''పండు... మేం తనకి పెట్టిన ఆ పేరూ మీకు తెలిసిందా... ఎవరు చెప్పారు... సుమని ఎపుడు కలిసారూ...? అంటూ ప్రశ్నల వర్షం కురిపించింది.

వంశీ చిరునవ్వుతో ''జరిగిందేమిటో చెబుతానుండండీ...'' అంటూ తనకి వచ్చిన కవరు పోస్టుమేన్ ముందుగా తమ ఇంటికి ఇచ్చిన సంగతి దగ్గర్నుండి దామోదరంగారి ఇంటి శుభకార్యానికి హాజరయినపుడు తామిద్దరూ కలిసి ఒకేలా శుభాకాంక్షలు రాసి బహుమతి నందుకోవటం వరకూ క్లుప్తంగా వివరించాడు.

చిరునవ్వుతో అంతా విన్న మీనాకుమారి ''చివరకు మీకేం కావాలీ?'' అన్నట్లుగా చూసేసరికి, వంశీ సుమజగారి ఇంటి అడ్రసు కావాలనీ, ఒకసారి కలుద్దామనుకుంటున్న సంగతీ చెప్పాడు.

మీనా ఆశ్చర్యంగా చూసి ''మీరెందుకు సుమనే అడగలేదూ?'' అని సందేహం బయటపెట్టింది.

ముందు కొంచెం సంకోచించినా అది వదిలేసి నిర్మొహమాటంగా వంశీ చెప్పాడు ''మీదగ్గర్నుండి తీసుకుందామనే ఉద్దేశ్యంతో నేనే ఛాలెంజ్ చేసాలెండి... ఆపైన సుమజ మీకు పంపిన గ్రీటింగు కార్డు ముందుగా నేను చూసాననే సంగతి తనకు చెప్పలేదు మరి...!'' అంటూ చిన్నగా నవ్వాడు.

''సరే... ఒక నిముషం ఉండండి. ముందు మీకు కాఫీ తెస్తాను...!'' అంటూ లోపలకు వెళ్ళింది.

అయిదు నిముషాల తర్వాత వచ్చిన మీనా వంశీకి కాఫీ కప్పు అందిస్తూ అడ్రసు రాసి ఇచ్చింది.

‘‘మీరీ విషయం సుమజకు ఫోను చేసి చెప్పారా?’’ అనడిగాడు వంశీ. అవునన్నట్లు తలవూపింది. ‘‘మరి... చెప్పాలిగా...’’ అని చిన్నగా నవ్వింది. ‘‘తనకి కంగ్రాట్స్ కూడా చెప్పాను... ఇపుడు మీకూ చెబుతున్నా’’ అనగానే వంశీ విస్మయంగా చూసి ‘‘ఎందుకంటారూ?’’ అనడిగాడు.

‘‘బావుంది... మీరు... తనని వెదుక్కుంటూ వెంటనే వెళ్లి ఎందుకు కలవాలనుకుంటున్నారో మీ ఉద్దేశ్యం ఏమిటో... ఆ మాత్రం గ్రహించలేనా? సుమకి ఎందుకు చెప్పానంటే... మీరు తనకి సరియైన జోడీ అనిపించింది. మీకూ అందుకే...’’ అని మీనా అంటూండగానే వంశీ మధ్యలో అడ్డం వచ్చి ‘‘అపుడే... అంత తొందర ఎందుకండీ...’’ అంటూ నవ్వేసాడు.

‘‘తొందర నాదికాదు... మీరే చూపిస్తున్నారు! నేను కేవలం నా అభిప్రాయాన్ని మాత్రమే చెప్పాను...!’’ అంటూ మీనా కూడా నవ్వింది.

ఆ అమ్మాయికి వెళ్ళొస్తానని చెప్పి వంశీ బయటకు వచ్చేసాడు.

ఇంటికి వచ్చిన వంశీని శ్యామసుందరి ‘‘ఇల్లు తెలిసిందా, అంత తొందరగా పరుగు పెట్టేసావు, వేణమ్మ చెప్పేది పూర్తిగా వినకుండానే...?’’ అనడిగింది.

‘‘తెలుసుకోవచ్చని వెళ్ళాలే... పనయిందిలే... వేణమ్మ చెప్పిన ఇంటికి పక్క ఇల్లేగా’’ అంటూ కొంచెం ఇబ్బందిగా తల్లిని చూసి లోపలకు తన గదిలోకి వెళ్ళిపోయాడు వంశీ.

* * *